క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాంసి: భీంపూర్ మండలంలోని పలు గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రావణ్ కుమార్ తెలిపారు. 11కేవీ విద్యుత్‌లైన్ మరమ్మతుల్లో భాగంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతర్గాం, గుబిడి, కరంజి, గోముత్రి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ అన్నారు. శనివారం పట్టణంలోని పలువురు వీధి వ్యాపారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు చౌక్‌ల్లోని డివైడర్ల వద్ద వ్యాపారాలు చేసేవారిని తొలగించనున్నట్లుగా తెలిపారు. శాశ్వతంగా వ్యాపారాలు నిర్వహించే స్థలాలను సైతం పరిశీలిస్తున్నట్లుగా వెల్లడించారు.

గంజాయి పట్టివేత

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలో ఓంకార్ అనే వ్యక్తి నుంచి రెండు కిలోల 42 గ్రాముల గంజాయిని శనివారం పట్టుకున్నట్లు ఎస్సై రాము తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సొనాల గ్రామంలోని ఓంకార్ అనే వ్యక్తి ఇంట్లో గంజాయి ఉన్నట్లు సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. అతడి వద్ద రెండు కిలోల 42 గ్రాముల గంజాయి లభించినట్లు తెలిపారు. ఓంకార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన షేక్ ఖైతర్, సయ్యద్ ఆఫీస్‌లు గంజాయి విక్రయిస్తూ పట్టుబడినట్లు టుటౌన్ ఎస్సై విష్ణు ప్రకాశ్ తెలిపారు. శనివారం బస్టాండ్ ప్రాంతంలో పెట్రోలింగ్‌లో భాగంగా అనుమానంగా కనిపించగా వారిద్దరిని తనిఖీ చేయగా వారి వద్ద 30 గ్రాముల గంజాయి లభించినట్లు పేర్కొన్నారు.

5న వాల్ పెయింటింగ్ పోటీలు

కైలాస్‌నగర్: స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఈనెల 5న మున్సిపల్ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, పెయింటింగ్ పోటీలను నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటలకు కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమీపంలో వాల్ పెయింటింగ్ పోటీలు ఉంటాయన్నారు.

పెన్‌గంగలో పెరిగిన నీటి ప్రవాహం

తాంసి: జిల్లా సరిహద్దుగా ఉన్న పెన్‌గంగ నదికి వరదనీటి ప్రవాహం పెరిగింది. వరుసగా కురుస్తున్న వర్షాలకు మహారాష్ట్రలోని ప్రాజెక్టుల నుంచి నీరు వదులడంతో పెన్‌గంగ ఉధృతంగా ప్రవహిస్తోంది. భీంపూర్ మండల పరిధిలోని గుబిడి, గోముత్రి, వడూర్, గొల్లఘాట్, తాంసి(కె) శివారులో వరద ఉధృతి పెరగడంతో గంగపుత్రులు చేపల వేటకు వెళ్లడం లేదు.

ఐటీఐ ప్రవేశాల రిపోర్టింగ్ గడువు పెంపు

ఆదిలాబాద్: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలో రెండో విడత ప్రవేశాలకు సంబంధించి రిపోర్టింగ్ గడువును పొడిగించినట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ రెండో విడతలో ప్రవేశాలు పొంది ఇప్పటివరకు రిపోర్ట్ చేయని విద్యార్థులకు అడ్మిషన్ రిపోర్టింగ్ తేదీని ఆగస్టు 5వరకు పొడిగించినట్లు తెలిపారు. రెండో విడతలో సీటు పొందిన అభ్యర్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధిక సాంద్రత పద్ధతిపై అవగాహన

ఎదులాపురం: కేంద్రీయ పత్తి పరిశోధన స్థానం సహకారంతో జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అధిక సాంద్రత పద్ధతితో పత్తి సాగు చేపడుతున్నారు. కాగా శనివారం స్థానిక కేవీకేలో క్షేత్ర ప్రదర్శన నిర్వహించి రైతులకు ఈ సాగుపై అవగాహన కల్పించారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ ప్రవీణ్‌కుమార్, శాస్త్రవేత్త రాజశేఖర్ యాజమాన్య పద్ధతులను వివరించారు. పంట 40 నుంచి 45 రోజుల వ్యవధిలో లేదా 40 నుంచి 45 సెంటీ మీటర్ల ఎత్తు దశకు చేరుకున్నప్పుడు మెపిక్వాట్ క్లోరైడ్ ఒక మిల్లీ లీటరును లీటరు నీటికి కలిపి తప్పనిసరిగా పిచికారీ చేయాలన్నారు. విత్తన కంపెనీల ప్రతినిధులు పవన్, రామ్మోహన్, ప్రశాంత్, నవీన్‌రెడ్డి, రవి, కేవీకే ఫీల్డ్ అసిస్టెంట్‌లు దిలీప్, మల్లేశ్, రైతులు పాల్గొన్నారు.

వివరాలు సేకరించాలి

ఇచ్చోడ: అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారుల వివరాలను అంగన్‌వాడీలు సేకరించాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని 1వ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీల పిల్లల వ్యక్తిగత సమాచారం సేకరించాలన్నారు. పిల్లల ఎత్తు, బరువు, వయస్సు లాంటి వివరాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఇచ్చోడ పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

ఉద్యమంలా మొక్కలు నాటాలి

- అధికారుల ప్రత్యేక సమావేశం
- పలు మండలాల్లో వనమహోత్సవం



ఉపాధిసిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్డీవో సాయన్న

ఇచ్చోడ: జిల్లా వ్యాప్తంగా ఉద్యమంలా మొక్కలు నాటాలని డీఆర్డీవో సాయన్న అన్నారు. శనివారం మండలంలోని కోకస్‌మన్నూర్‌లో మొక్కలు నాటి ఉపాధిహామీ సిబ్బందితో మాట్లాడారు. ఉపాధిహామీ సిబ్బంది ద్వారా వనమహోత్సవం నిర్వహించాలన్నారు. ప్రభుత్వ స్థలాలు, పాఠశాల ఆవరణలో, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ప్రతిఒక్కరిని భాగస్వాములు చేయాలన్నారు. నాటిన ప్రతీ మొక్కను రక్షించుకోవాలని కోరారు. ఈనెల 5 నుంచి 9 వరకు పచ్చదనం... స్వచ్ఛదనం విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట ఈజీఎస్ ఏపీవో నరేందర్ గౌడ్, ఈసీ సుధాకర్, టెక్నికల్ అసిస్టెంట్ రాజేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ సుభాష్ పాల్గొన్నారు.

జైనథ్: ఈనెల 5 నుంచి 9 వరకు గ్రామంలో పచ్చదనం.. పరిశుభ్రత కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని పార్డి(బి) పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు అన్నారు. శనివారం పంచాయతీ కార్యదర్శి శేఖర్‌తో కలిసి పంచాయతీ కార్యాలయంలో అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెంచడం, మొక్కలు నాటడం, ప్రజలు సురక్షిత తాగునీటిని అందించడం గురించి చర్చించారు.

బోథ్: ప్రతీ విద్యార్థి తమ కుటుంబీకుల పేరిట ఒక మొక్కనాటి సంరక్షించాలని సామాజిక కార్యకర్త జక్కుల వెంకటేశ్ అన్నారు. ×ఏక్ పేడ్ మాకే నామ్ సే× కార్యక్రమంలో భాగంగా టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ బాలికల పాఠశాలలో మొక్కలు నాటారు. పర్యావరణ రక్షణ కోసం విద్యార్థులు నడుంబిగించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవి కుమార్, షేక్ అలీ, ఉపాధ్యాయులు లింగంపల్లి సంతోష్, కొట్టాల రమేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు రాజు



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 5 నుంచి 9 వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం.. పచ్చదనం, కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో భాస్కర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో గ్రామ పంచాయతీ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు గ్రామసభ నిర్వహించారు. గ్రామాలను స్వచ్ఛత గ్రామాలుగా మార్చడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవో సంజీవ్ రావ్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను కాపాడాలి

బేల: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని మండల వ్యవసాయాధికారి సంధ్యారాణి అన్నారు. శనివారం మండలంలోని అవాల్‌పూర్ గ్రామంలోని రైతువేదిక పరిసరాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మినక పుష్పలత, మాజీ ఎంపీటీసీ నగేశ్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి రాజు, రైతులు పాల్గొన్నారు.

ధ్యాన మార్గంలో నడవాలి



ధ్యాన కేంద్రంలో పూజలు చేస్తున్న భక్తులు

తలమడుగు: సద్గురు పరమహంస పూలాజీబాబా చూపిన ధ్యాన మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని పట్నాపూర్ సిద్ధేశ్వర సంస్థ అధ్యక్షుడు ఇంగ్లీ కేశవ్, మాజీ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీ పూలాజీ బాబా ఆలయ 27వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గత 27 సంవత్సరాల నుంచి వార్షికోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. మనిషి నిజ జీవితంలో ఎలాంటి ఖర్చు లేకుండా ఎవరికి ఇబ్బంది కలగకుండా ఉండలంటే ధ్యానమే ఏకైక మార్గమన్నారు. అనంతరం ధ్యాన కేంద్రంలో జెండా ఆవిష్కరణ, హారతి, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, పూలాజీ బాబా శిష్యులు కమలబాయి, తుకారం, సతీష్, పోశెట్టి, జ్ఞాన కమిటీ అధ్యక్షుడు సురేష్ రెడ్డి, ఉపాధ్యక్షుడు అశోక్, మాజీ జెడ్పీటీసీ బాబాన్న, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి



రైతులతో మాట్లాడుతున్న సునీల్ మనోహర్

ఇచ్చోడ: సైబర్ నేరాలపై రైతులు జాగ్రత్తగా ఉండాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ సునీల్ మనోహర్ అన్నారు. శనివారం బ్యాంక్‌లో ఆర్థిక అక్షరాస్యతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ డబ్బులను రైతుల ఖాతాలో జమ చేస్తున్నందును కొంత మంది సైబర్ నేరగాళ్లు ఫోన్‌లకు మోసపూరిత లింకులు పంపుతున్నారని తెలిపారు. నిరాక్షరాస్యత, అమాయక రైతులు మోసపోయే అవకాశం ఉందన్నారు. ఖాతాదారులకు ఎలాంటి సందేహం ఉన్న నేరుగా బ్యాంకులోకి వచ్చి సమాచారం తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సంతోష్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

బోథ్: సైబర్ క్రైంపై రైతులు జాగ్రత్తగా ఉండాలని సొనాలలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్, ఐహెచ్‌ఆర్‌వో జిల్లా ప్రధాన కార్యదర్శి బాశెట్టి రాజ్‌కుమార్‌లు అన్నారు. శనివారం బ్యాంకుకు వచ్చిన రైతులతో మాట్లాడారు. ఫోన్‌లకు వచ్చిన లింకులను ఓపెన్ చేయవద్దన్నారు. ఆధార్, పాన్ కార్డు వివరాలను ఎవరికీ చెప్పవద్దని సూచించారు. ఆర్థిక నేరాలు జరిగితే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

‘తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం’



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య విద్యార్థులు, వైద్యులు

ఆదిలాబాద్‌టౌన్: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. రిమ్స్ చిల్డ్రన్స్ వార్డు ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. రిమ్స్ కళాశాల నుంచి కుమ్రం భీం చౌరస్తా వరకు అవగాహన ర్యాలీ చేపట్టారు. రిమ్స్ మెడికోలు, నర్సింగ్ విద్యార్థులు, వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ.. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలని సూచించారు. తల్లిపాలల్లో పోషక విలువలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిమ్స్ వైద్యులు అనంత్‌రావు, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: బిడ్డ పుట్టిన నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు పడితేనే ఆరోగ్యవంతంగా బిడ్డ ఎదుగుదల ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ అన్నారు. శనివారం మండలంలోని బుర్కపల్లి గ్రామంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు అంగన్‌వాడీలలో అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మంజుల, గయబాయి, పార్వతి, ఆశలు పాల్గొన్నారు.

పిల్లలకు అదనపు ఆహారం ఇవ్వాలి

ఎదులాపురం: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని సుందరయ్యనగర్ 1వ అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. చిన్న పిల్లలకు ఆరు నెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలన్నారు. ఆరు నెలల అనంతరం అదనపు ఆహారం అందించాలని పేర్కొన్నారు. ఇందులో మెప్మ సునీత, ఏఎన్‌ఎం తులసీ, అంగన్‌వాడీ టీచర్ రాధ, ఆర్పీ ఫరిదా, చిన్నారుల పోషకులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అందజేత

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ఉప్పల్ శేఖర్ గత 10 నెలల క్రితం పట్టణంలోని ఎయిరోడ్రామ్‌లో రూ.55 వేల విలువల గల సెల‌ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో బాధితుడు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేశాడు. కాగా.. శనివారం వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ సెల్‌ఫోన్‌ను బాధితుడికి అందజేశారు. ఇందులో సిబ్బంది సుధాకర్, హన్మంతు, రాములు ఉన్నారు.

మాజీ మంత్రిని కలిసిన ఎంఈవో

ఆదిలాబాద్‌టౌన్: మాజీ మంత్రి జోగురామన్నను ఇటీవల జిల్లాకు బదిలీపై వచ్చిన ఆదిలాబాద్ ఎంఈవో డి.సోమయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కౌటాల నుంచి ఆదిలాబాద్‌కు బదిలీపై రావడం పట్ల జోగురామన్న సంతోషం వ్యక్తం చేశారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, ప్రధానోపాధ్యాయుడు నర్సయ్య, ఉపాధ్యాయుడు సత్యానారాయణ, తదితరులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన పశువైద్యాధికారులు

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి, ముత్నూర్ పశువైద్య ఆస్పత్రిలో శనివారం వైద్యులు బాధ్యతలు స్వీకరించారు. భీంపూర్ మండలంలోని పశువైద్య ఆస్పత్రిలో విధులు నిర్వహించిన రాథోడ్ సుభాష్ ఇంద్రవెల్లి పశువైద్య ఆస్పత్రిలో బాధ్యతలు స్వీకరించగా.. ఆదిలాబాద్ పశువైద్య ఆస్పత్రిలో విధులు నిర్వహించిన వైద్యుడు సుదేష్ ముత్నూర్ పశువైద్యుడిగా బాధ్యతు స్వీకరించారు. వైద్యులను సిబ్బంది, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పశువైద్య ఆస్పత్రి సిబ్బంది గాయక్‌వాడ్ అనిల్, ఆత్రం రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు సేవ చేయడం సంతృప్తినిచ్చింది

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా గ్రామీణ, పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడం సంతృప్తి నిచ్చిందని డాక్టర్ సాగర్ అన్నారు. ఇచ్చోడ ఆరోగ్య కేంద్రంలో పనిచేసి బదిలీపై వెళ్తున్న సందర్భంగా శనివారం పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఇక్కడి సిబ్బంది, ప్రజల సహకారం మరిచిపోలేనిదన్నారు. డాక్టర్ సాగర్, ఫార్మసిస్ట్ జయప్రియ, ఎంపీహెచ్‌ఎస్ కళావతి, ఏఎన్‌ఎం పార్వతిలను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిరణ్‌కుమార్, హెల్త్‌సూపర్ వైజర్ బ్రహ్మానందరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కైలాస్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛదనం.. పచ్చదనం విజయవంతం చేయాలి

కైలాస్‌నగర్: ప్రజల జీవన ప్రమాణాల పెంపుతో పాటు పారిశుధ్యం, పచ్చదనం పెంపొందించేలా ఈనెల 5నుంచి 9వ వరకు చేపట్టనున్న స్వచ్ఛదనం .. పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శనివారం మున్సిపల్ సమావేశ మందిరంలో కౌన్సిలర్లు, వార్డు ప్రత్యేకాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఐదు రోజుల పాటు అనుసరించాల్సిన కార్యక్రమాలను కమిషనర్ ఖమర్ అహ్మద్ వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. తగిన జాగ్రత్తలు పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కళాశాలలు, పాఠశాలల్లో, అన్నివార్డుల్లో ఆయా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఖాళీ ప్రాంతాల్లో మొక్కలు నాటేలా ప్రణాళికలు రూపొందించినట్లుగా తెలిపారు. సమావేశంలో డీఈ తిరుపతి, వార్డు ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయండి



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని సెంట్రల్ గార్డెన్‌లో ఈనెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు గోడం గణేశ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో శనివారం కరపత్రాలు ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని కుమ్రం భీమ్ కాలనీ న్యూ హౌజింగ్ బోర్డు నుంచి స్థానిక సెంట్రల్ గార్డెన్ వరకు ర్యాలీ కొనసాగుందన్నారు. ఆదివాసీలు, మేధావులు, విద్యార్థులు, అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆదివాసీ నాయకులు సంజీవ్, మనోజ్, అశోక్, వరుణ్, రాము, భుజంగ్‌రావు, ఆనంద్‌రావు, గణేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్తం..

కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ చైర్మన్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ శనివారం జిల్లా కలెక్టర్ రాజర్షి షాను తన కార్యాలయ ఛాంబర్‌లో కలిశారు. బల్దియాలో వివిధ అభివృద్ధి పనుల కోసం టీయూఎఫ్ఐడీసీ ద్వారా గత ప్రభుత్వ హయాంలో రూ.50 కోట్లు మంజూరయ్యాయన్నారు. అందులో కేవలం రూ.5.40 కోట్లను మాత్రమే విడుదల చేశారన్నారు. ఎలాంటి సవరణలు, మార్పులు చేయకుండా రూ.46.79 కోట్లను సైతం విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

దానం నాగేందర్‌పై కేసు నమోదు చేయాలి

ఎదులాపురం: అసెంబ్లీలో ప్రసంగిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై సుమోటోగా కేసులు నమోదు చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు ఇజ్జగిరి నారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తోటి ఎమ్మెల్యేలపై అసభ్య పదజాలంతో మాట్లాడడం సరికాదన్నారు.

మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శిగా విఠల్

బోథ్: బోథ్ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శిగా విఠల్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ప్రత్యేక శ్రేణి కార్యదర్శిగా పనిచేసిన నారా మనోహర్ బదిలీ అయ్యారు. కాగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన విఠల్‌ను మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి శాలువాతో సత్కరించారు.

సీఐకి సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: బదిలీపై వెళ్తున్న రిజర్వ్ ఏఆర్ రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ నవీన్‌ను జిల్లా ఎస్పీ గౌష్ ఆలం శాలువాతో సత్కరించారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఆత్మీయ వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థికి సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి సీహెచ్ ఈశ్వర్ టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో 18వ ర్యాంకు సాధించాడు. శనివారం కళాశాల యాజమాన్యం ఆయనను సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. భవిష్యత్‌లో ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు.

ఎంపీడీవోకు సన్మానం

బోథ్: బోథ్ ఎంపీడీవోగా నియమితులైన జీవన్‌రెడ్డిని సొనాల గ్రామ పంచాయతీ మాజీ పాలకవర్గ సభ్యులు శనివారం శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చెట్లపెల్లి సదానందం, మాజీ వార్డు సభ్యులు భోజరాజు, గ్రామస్తులు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బ్యాగులు పంపిణీ

తాంసి: సమనుజ్ఞ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం భీంపూర్ మండలంలోని గుబిడిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు బ్యాగులు పంపిణీ చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి విశ్వనాథ్ విద్యార్థులకు బ్యాగులు అందజేశారు. రూ.30 వేల విలువ చేసే 60 బ్యాగులను సంస్థ తరపున పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం తిరుపతి, ఉపాధ్యాయుడు ప్రభాకర్, సంస్థ సభ్యులు సాయిరాజ్, విగ్నేష్, కార్తీక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ జిల్లా కేంద్రానికి చెందిన బీజేపీ నాయకుడు శ్రీరామోజీ సంతోష్ కుటుంబసభ్యులను శనివారం పరామర్శించారు. సంతోష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఎమ్మెల్యే శనివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు సోమిరెడ్డి, అడెల్లు, గోపి, తదితరులు ఉన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభం

ఇంద్రవెల్లి: మండలంలోని పాటగూడ(కె) గ్రామం రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం భారీ వర్షాల కారణంగా నేలకొరిగింది. స్తంభానికి మరమ్మతులు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించిన్నా.. ఎవరూ పట్టించుకోవడం గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సున్నం రాజయ్య ఆశయాలు సాధించాలి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఎదులాపురం: టీఏజీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ సున్నం రాజయ్య ఆశయాలను సాధించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో శనివారం ఆయన 4వ వర్ధంతిని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. భద్రాచలం ఎమ్మెల్యేగా 4సార్లు గెలిచి ప్రజా గొంతుకగా కార్మిక గిరిజన, ప్రజా సమస్యలపై గళం వినిపించారని గుర్తు చేశారు. కమ్యూనిస్టు విలువలతో బ్రతికి ఉమ్మడి రాష్ట్రంలోనే ఆదర్శ నాయకుడిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి, లంక రాఘవులు, బండి దత్తాత్రి, అన్నమొల్ల కిరణ్, సుజాత, పోచక్క, ఆశన్న పాల్గొన్నారు.

సాయిగనర్‌లో రేషన్ పాయింట్ ఏర్పాటు



రేషన్ సరుకుల కోసం వచ్చిన కాలనీవాసులు

బోథ్: మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో రేషన్ దుకాణం లేక కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను ఇటీవల పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అధికారులు స్పందించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి కిరణ్ కుమార్ సాయినగర్‌లో రేషన్ పాయింట్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో శనివారం రేషన్ పాయింట్‌ను ఏర్పాటు చేసి రేషన్ సరుకులు అందజేశారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే కాలనీలో పూర్తిస్థాయి రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఉదారత చాటుకున్న వసుధా ఫౌండేషన్



బాధితుడికి చెక్కు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

జైనథ్: మండలంలోని మేడిగూడ- ఆర్ గ్రామానికి చెందిన ఓడెల వెంకటికి వసుధా ఫౌండేషన్ సభ్యులు రూ. 10వేల చెక్కును అందించి, తమ ఉదారత చాటుకున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన వెంకటి దర్జీ పని చేస్తూ జీవనం గడుపుతున్నాడు. గత కొంత కాలంగా ఆయన పక్షవాతంతో బాధపడుతున్నాడు. నెలకు రూ. 4వేల వరకు మందులకు ఖర్చు చేయాల్సి రావడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. దీంతో అతని దీన పరిస్థితికి చలించిన గ్రామానికి చెందిన క్యాతం శివ ప్రసాద్ రెడ్డి ఈ విషయాన్ని వసుధా ఫౌండేషన్ జిల్లా బాధ్యులు భూపతి రెడ్డికి విన్నవించాడు. స్పందించిన ఆయన రూ. 10వేల చెక్కును మంజూరు చేయించి, బాధితుడికి స్వయంగా అందించారు.

గురుకులలో మాక్ పోలింగ్



పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో శనివారం విద్యార్థులతో నమూన ఎన్నికలు నిర్వహించారు. సీనియర్ విద్యార్థులు పోలింగ్ సిబ్బందిగా వ్యవహరించారు. కళాశాల ప్రిన్సిపాల్ యూనుస్ సలీం మాట్లాడుతూ.. ఎన్నికల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, అగ్నిమాపక శాఖ అధికారి అశోక్ ముండే పాల్గొన్నారు.

బెల్ట్‌షాప్‌ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న తుడుందెబ్బ నాయకులు

ఇంద్రవెల్లి: ఏజెన్సీ మండలాల్లో బెల్ట్‌షాప్‌ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని తుడుందెబ్బ జిల్లా కార్యదర్శి సోయం రాందాస్, జిల్లా ఉపాధ్యక్షులు గేడం భారత్‌లు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సంబంధిత అధికారులు మామూళ్లు తీసుకొని మద్యం బెల్ట్‌షాపుల నిర్వహణకు సహకరిస్తున్నారని అన్నారు. అనుమతులు లేకుండా విచ్చలవిడిగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులను మూసివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు పాల్గొన్నారు.